క్లుప్తంగా

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న అఖిల్

కొండమల్లేపల్లి : డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని ఏబీవీపీ రాష్ట్ర కార్య సమితి సభ్యుడు సామల అఖిల్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా శనివారం కొండమల్లేపల్లిలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ పౌరులుగా ఉన్నతమైన ఆశయాల సాధన కోసం క్రమ శిక్షణతో మెలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మౌనేశ్వర్‌చారి, శ్రీకాంత్, కార్తీక్, హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలి



మాట్లాడుతున్న ప్రభావతి

కొండమల్లేపల్లి : పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14రకాల నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం చేపట్టిన కొండమల్లేపల్లిలో సంతకాల సేకరణలో భాగంగా ఆమె మాట్లాడుతూ పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు తీసుకురావడం వల్ల పేదలపై అధిక భారంపడుతుందన్నారు. ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా రాష్ట్ర కమిటీ సభ్యురాలు పద్మ, మనీషా, మంజుల, ఏకలవ్య, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డును ఏర్పాటు చేయాలి



మార్కెట్ కమిటీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న డైరెక్టర్లు

పెద్దఅడిశర్లపల్లి : నూతనంగా ఏర్పడిన గుడిపల్లి మండల కేంద్రంలో రైతుల సౌకర్యార్థం నూతనంగా మార్కెట్‌యార్డును ఏర్పాటు చేయాలని కోరుతూ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూతం సైదులు దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునామాధవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్వయ్య, పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, డైరెక్టర్లు దీప, రాములు, సుదర్శన్‌రెడ్డి, సుధాకర్, గోవర్ధన్, కేశ్యానాయక్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

కొండమల్లేపల్లి : ఎమ్మార్పీఎస్ దొనియాల గ్రామ శాఖ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా అందుగుల శ్రీను మాదిగ, ఉపాధ్యక్షుడిగా ఎలిమినేటి నరేష్ మాదిగ, కార్యదర్శిగా ఎలిమినేటి కాశయ్య, సహాయ కార్యదర్శిగా బుడిగపాక అశోక్, కోశాధికారిగా మద్దిమడుగు ఎల్లయ్య, గౌరవ అధ్యక్షులుగా ఐతపాక సురేష్, ఎలిమినేటి యాదయ్య, రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'వేల గొంతులు-లక్ష డప్పులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు ఎదుల ఎల్లయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిరాల రమేష్, పి.అనిల్, కూర సాలయ్య, యాదయ్య, సైదయ్య, చంద్రయ్య, రాములు, లింగయ్య, లక్ష్మయ్య, బక్కలయ్య, జంగయ్య, అంజయ్య పాల్గొన్నారు.

ఏఎమ్మార్పీ సందర్శన



పుట్టంగండి సిస్టర్న్‌ను పరిశీలిస్తున్న హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని ఏఎమ్మార్ ప్రాజెక్టును శనివారం హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ (హెచ్‌ఎండబ్ల్యూఎస్) అధికారుల బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా పుట్టంగండి సిస్టర్న్, లింక్ కెనాల్, ఏకేబీఆర్‌ను పరిశీలించారు. సంక్రాంతి పండుగ వేళల్లో హైదరాబాద్‌కు నీటి సరఫరాలో ఆటంకం కలుగకుండా తనిఖీ చేసేందుకు వచ్చినట్టు సమాచారం. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, సుదర్శన్, ఏఎమ్మార్పీ ఈఈ సత్యనారాయణ, డీఈ నాగయ్య, ఏఈలు శ్రావణ్‌కుమార్, శిల్ప, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నియామకాలకే పరిమితమా!

- జాడలేని సలహా సంఘాల కమిటీలు
- కానరాని ప్రజల భాగస్వామ్యం
- పథకాల అమలులో కొరవడిన పారదర్శకత

పెద్దవూర : ప్రభుత్వ పాఠశాలలను, ఆసుపత్రులను సక్రమంగా నిర్వహించేందుకు, వ్యవసాయంలో సాంకేతికతను ప్రోత్సహించేందుకు, పల్లెలు, పట్టణాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజా పంపిణీ వ్యవస్థను పర్యవేక్షించేందుకు ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యావేత్తల, వివిధ నిపుణులతో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేస్తున్న కమిటీలు, సంఘాలు నామమాత్రంగా తయారయ్యాయి. నిబంధనల ప్రకారం సభ్యులను నియమిస్తున్నా, కమిటీ కార్యకలాపాలు మాత్రం కాగితాలకే పరిమితమవుతున్నాయి. నెలల తరబడి సమావేశాలు జరపకపోవడంతో ఆయా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలు సైతం అక్రమాలకు నిలయంగా మారినా అడిగేవారు లేరు. ఇంత జరుగుతున్నా పాలకులు గాని, అధికారులు గాని పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి యేడాది కాలం పూర్తయినా కమిటీల కార్యకలాపాలు కనిపించడం లేదు.

పాఠశాల యాజమాన్య కమిటీలు కూడా..

విద్యా వ్యవస్థలను గాడిన పెట్టేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు నామమాత్రంగా మారాయి. ఏటా పాఠశాల ప్రారంభంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి కమిటీ సభ్యులను ఎన్నుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఈ కమిటీలు ప్రతినెలా తప్పకుండా సమావేశం కావాలి. పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాధిస్తున్న ఫలితాలపై సమీక్ష నిర్వహించాలి. అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ఆయా సమస్యల పరిష్కారానికి, వసతుల కల్పనకు, ఫలితాల పెంపునకు కృషి చేయాలి. కానీ ఎక్కడా ఆ పరిస్థితి కనిపించడం లేదు.



ఆస్పత్రి సలహా సంఘాలు నామమాత్రం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం మండల, పట్టణ, జిల్లా స్థాయి దవాఖానాల్లో ఆస్పత్రి సలహా సంఘాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులను నియమించాలని ఆదేశాలు జారీ చేసింది. మండల పరిధిలో ఎంపీపీ, ఏరియా ఆస్పత్రుల్లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఈ కమిటీలు కొనసాగాలి. కానీ మండల పరిధిలోని ఆస్పత్రుల్లో కమిటీలు నామమాత్రంగా తయారయ్యాయి. సమావేశాలు జరగకపోవడంతో ఆస్పత్రుల నిధులు, వాటి ఖర్చు తీరుతెన్నులను, అక్కడి సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారు. ఏరియా ఆస్పత్రుల్లో సైతం ఆస్పత్రి సలహా సంఘాల సమావేశాలు తూతూమంత్రంగా సాగుతున్నాయి. కమిటీ చైర్మన్లు, సలహా మండలి సభ్యులు ఆస్పత్రిపై, వైద్యులపై పెత్తనానికి పరిమితమవుతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి తప్ప సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

పత్తాలేని వ్యవసాయ సాంకేతిక కమిటీలు

వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యానవన, మత్స్యశాఖలను సమన్వయం చేస్తూ ప్రభుత్వం గతంలో సాంకేతిక వ్యవసాయ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసింది. ఆత్మ ఆధ్వర్యంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో వ్యవసాయంలో సాంకేతికతకు రైతులను ఆధునిక సాగు వైపు మళ్లించేందుకు ఈ కమిటీలు కృషి చేయాలి. అప్పట్లో ఈ కమిటీల్లో నియోజకవర్గ స్థాయి ఉత్తమ రైతులను సభ్యులుగా చేర్చారు. కానీ ప్రస్తుతం ఈ కమిటీలు ఎక్కడా కూడా పనిచేస్తున్న దాఖలాలు లేవు.

ఆహార సలహా సంఘాలదీ ఇదే పరిస్థితి

ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా పేదలకు నిత్యావసర సరుకులు ప్రతినెలా క్రమం తప్పకుండా అందేలా చూసేందుకు ఆహార సలహా సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అక్రమాలు జరగకుండా ఈ కమిటీ నిరంతరం పర్యవేక్షించాలి. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయిలో గుర్తింపు పొందిన పార్టీల నాయకులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో సలహా సంఘాలను ఏర్పాటు చేస్తారు. ఈ సంఘం ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై ప్రజా పంపిణీ వ్యవస్థ తీరుతెన్నులపై చర్చించాలి. ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పదవీ కాలం పూర్తయి ఏడాది కావొస్తుంది. దీంతో ప్రస్తుతం ఈ సంఘాలు ఎక్కడా సమావేశం కావడం లేదు. మండలంలో తహసీల్దార్లు బదిలీ అయితే కొత్తగా వచ్చిన తహసీల్దార్లు నాయకులను, రేషన్ డీలర్లను కార్యాలయానికి పిలిపించుకొని తూతూమంత్రంగా నిర్వహించి పూర్తయినట్లు చూపుతున్నారు. ఇలాంటి సంఘాలు ఉంటాయని చాలామంది ప్రజలకు తెలియకపోవడం విచారకరం.

విధులు నిర్వర్తించేలా చూడాలి



"ప్రభుత్వ పథకాలు పక్కదారి పట్టకుండా, పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అందేలా ఏర్పాటు చేసిన కమిటీలు సక్రమంగా విధులు నిర్వర్తించేలా చూడాల్సిన బాధ్యత పాలకులు, ఉన్నతాధికారులపై ఉంది. కమిటీలు పక్కాగా పనిచేస్తే అవినీతి, అక్రమాలకు తావులేకుండా ఉంటుంది. ఇన్ని కమిటీలు ఉంటాయన్న సంగతి చాలామందికి తెలియదు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పదవీ కాలం పూర్తయ్యి ఏడాది అవుతున్నా నూతన పాలకమండళ్ల ఏర్పాటు లేదు.

– మెండె సైదులుయాదవ్, తుంగతుర్తి

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్

మిర్యాలగూడ అర్బన్ : విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఖమ్మంపాటి శంకర్ అన్నారు. శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా బకాయిలో ఉన్న రూ.8700 కోట్ల స్కాలర్‌షిప్‌లు విడుదల చేయడకుండా విద్యార్థులను, విద్యా సంస్థల యాజమాన్యాలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. గురుకులాల్లో సరైన మౌలిక సవతులు లేక, నాన్ టీచింగ్ ఫ్యాకల్టీ పూర్తిగా నింపకుండా ప్రభుత్వ విద్యను నీరుకారుస్తుందని విమర్శించారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు, కస్తూర్బా గాంధీ పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్తగా ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ స్కూల్ల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్, జిల్లా నాయకులు సైదానాయక్, లక్ష్మణ్, వెంకటేశ్, రవీందర్, జగదీష్, వీరన్న, సంపత్, నవదీప్, త్రిష, పుష్పలత, చరణ్, వర్షిత, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మఠంపల్లి : ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సాగర్ సిమెంట్స్ పరిశ్రమ వీపీ ఎం.వీ.రమణమూర్తి అన్నారు. శనివారం మండలంలోని పరిశ్రమలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈనెల 17 వరకు రోడ్డు భద్రత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమలో పనిచేసే కార్మికులతో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం హెచ్‌ఆర్ హేమంత్, పరిశ్రమ అధికారులు సుబ్రహ్మణ్యం, ఆనంద్, తూడి వెంకటరెడ్డి, వి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వివేకానందుడికి నివాళి



వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ : స్వామి వివేకానంద జయంతి వేడుకలను శనివారం దేవరకొండ పట్టణంలో జిల్లా అంచల్ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అంచల్ సమితి అధ్యక్షుడు వనం జగదీశ్వర్, ప్రాథమిక ప్రశిక్షణ ప్రబారి పంగునూరి లింగయ్య మాట్లాడారు. అనంతరం స్వామి వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, కవిత, చెన్నయ్య, శశికళ, సైదులు, శారద, రేవంత్ పాల్గొన్నారు

వైభవంగా కూడార్రై ఉత్సవం



స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్న ప్రధాన పూజారి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని శ్రీసాయిదత్తాత్రమంలో శనివారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీ అష్టలక్ష్మి మందిరంలో 108 గిన్నెల్లో ప్రసాదాలను తయారు చేసి స్వామివారికి సమర్పించారు. పట్టణంలోని పరిసరాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తిరుప్పావై పారాయణ నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గుండా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ప్రతాఫ్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి మట్టయ్య, జానకి రాముడు, శ్రీనివాస్ బాబు, విక్రమ్, పద్మ, సీతా భవాని, కళ్యాణి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

'వర్డ్ అండ్ డీడ్' లో సంక్రాంతి వేడుకలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

మిర్యాలగూడ : పట్టణంలోని వర్డ్ అండ్ డీడ్ ప్రైమరీ పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. చిన్నారులు హరిదాసు వేషధారణ, సంకీర్తనలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎండీ కలీం మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమలత, అన్నపూర్ణ, నిఖిత, శిల్ప, షబానా, కరుణ, కీర్తన, రాజశేఖర్, ఫర్జానా, ఆసియా, నస్రీన్, హబీబా తదితరులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ



రద్దీగా ఉన్న మాడుగులపల్లి టోల్‌ప్లాజా

వేములపల్లి(మాడుగులపల్లి) : సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్, ఇతర ప్రాంతాల ప్రజలు ఆంధ్రాతోపాటు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్తుండడంతో మాడుగులపల్లి మండల కేంద్రంలోని అద్దంకి –నార్కట్‌పల్లి రహదారిపైగల నామ్స్ ఎక్స్‌ప్రెస్‌వే టోల్ ప్లాజా శనివారం రద్దీగా మారింది. కాగా వాహనాకు ఫాస్టాగ్ ఉండడంతో వాహనాలు ఇబ్బందులు లేకుండా సునాయసంగా వెళ్లాయి.

1050 కేజీల బెల్లం, 50కేజీల పటిక స్వాధీనం



పట్టుబడిన బెల్లం, పటికతో అధికారులు

దేవరకొండ : నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న 1050 కేజీల బెల్లంతో పాటు 10లీటర్ల నాటుసారాను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. వివరాల ప్రకారం డిండి మండలం చెరుకుపల్లి ప్రాంతంలో ఎక్సైజ్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహిస్తుండగా బీదర్ నుంచి కారులో నాటుసారా తయారీకి వినియోగించే బెల్లంతో పాటు పటిక, సారా, కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ నాటుసారా తయారీకి పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సీఐ భిక్షారెడ్డి, ఎస్ఐ బాలరాజు, యాదగిరి తదితరులున్నారు. నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లాన్ని పట్టుకున్న అధికారులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వివి కమల్ హాసన్‌రెడ్డి, ప్రదీప్‌రావు అభినందించారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు

మిర్యాలగూడ : ఆశా వర్కర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి, జిల్లా నాయకుడు దయానంద్‌లు కోరారు. శనివారం వారు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి ఆశాలతో కలిసి వినిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరి, పద్మ, లక్ష్మీ,జయమ్మ, సరిత, శారదా, కళావతి, విఘ్నేశ్వరి పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



హాలియా : క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా : క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా తిరుమలగిరి(సాగర్) మండలంలోని బంటు వెంకన్నబావి, సపావత్ తండాల్లో గణేష్ యువజన సంఘం, మేరావత్ ముని నాయక్(ఆస్ట్రేలియా) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యమైన సమాజం క్రీడా మైదానంలో ప్రారంభమవుతుందన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెపొందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు యాదవ్, మాజీ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బీవీ రమణ రాజు, సీనియర్ నాయకులు తేరా రాఘవరెడ్డి, నాయకులు జటావత్ శ్రావణ్‌కుమార్ నాయక్, ప్రకాష్ నాయక్, కిశోర్ నాయక్, బీఆర్ యాదవ్, చల్లా కోటేష్ యాదవ్, నాగార్జున వెంకట్రావు, మేఘనాయక్, లాల్‌సింగ్, జామ్లా, రవి, రంగా, లచ్చిరాం, చందు నాయక్, మంగ్యా, బాలు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

పెద్దఅడిశర్లపల్లి : క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు అన్నారు. శనివారం మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద సంక్రాంతి పండుగ సందర్భంగా యాదవ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరక ధాడుర్యానికి దోహదం చేస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొల్లు గోవింద్, వీరమళ్ల సతీష్, ప్రతాప్‌రెడ్డి, అచ్చుత్‌కుమార్, నగేష్, గిరి, బాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న ప్రభావతి

హాలియా : మహిళలు వంటింటికే పరిమితం కాకుండా రాజకీయాల్లో కూడా చైతన్యం పెంచుకోవాలని ఐద్వా హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి అన్నారు. హాలియా పట్టణంలోని పదో వార్డులో శనివారం ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. నాటి నుంచి నేటి వరకు పాలకులు మహిళలపై చిన్నచూపేనన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సమాజంలో సగబాగంగా ఉన్న మహిళలకు రాజకీయంగా, ఆర్థికంగా సగభాగం అవకాశాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం ఏరులై పారుతుందని, మద్యానికి బానిసైన కుటుంబాలు ఇంటి పెద్దను కోల్పోయి వీధిన పడుతున్నారని తక్షణమే బెల్ట్ షాపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అవుతా సైదులు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కారంపూడి ధనమ్మ, రేవెల్లి వెంకటేశ్వర్లు, పాదిల వెంకన్న, జటావత్ రవి నాయక్, బహుమతుల దాతలు సైదులు, సంతోష్, పుష్పలత. జిల్లా సైదులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ ముసుగులో మత్తు పదార్థాల ఉత్పత్తి

- కోళ్ల దానా వ్యాపారం పేరుతో అల్ప్రాజోలం దందా ..
- ప్రకాశం జిల్లా దర్శి కేంద్రంగా సాగుతున్న వ్యాపారం
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్
- రూ.55 లక్షల విలువైన అల్ప్రాజోలం పట్టివేత

మిర్యాలగూడ అర్బన్ : తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాల నుంచి అక్రమంగా సరఫరా అవుతున్న అల్ప్రాజోలం దందాకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణకు అల్ప్రాజోలం సరఫరా చేస్తున్న ముఠాపై కొంత కాలంగా నిఘా పెట్టిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌టీఎఫ్ బృందాలు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా దర్శి నుంచి తెలంగాణకు కారులో అల్ప్రాజోలం సరఫరా చేస్తుండగా పక్కా సమాచారంతో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడలో పట్టుకున్నారు. ప్రకాశం జిల్లా దర్శి మండలంలోని ఉమామహేశ్వరం గ్రామానిక చెందిన రాజశేఖరరెడ్డి కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉపాధి కోసం కొన్ని సంత్సరాల క్రితం హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డాడు. ఇక్కడ పనిచేస్తూనే తన గ్రామంలో పౌల్ట్రీ ఫాం పెట్టాడు. ఆ వ్యాపారం ముసుగులో అల్ప్రాజోలం తయారీకి తెరలేపాడు. అల్ప్రాజోలాన్ని తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు చేరవేసి సొమ్ము చేసుకుంటున్నాడు. కాగా కొద్ది కాలంగా నిందుతుడి కదలికలపై నిఘా పెట్టిన అధికారులు పక్కా సమాచారంతో శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిందుతుడి కోళ్ల ఫారం యూనిట్‌పై దాడి చేసిన తెలంగాణ పోలీసులు అల్ప్రాజోలం తయారీకి ఉపయోగించే యూనిట్‌తోపాటు ముడిసరుకును స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు పేర్కొన్నారు. కాగా ఈ దాడుల్లో రూ.55లక్షల విలువ చేసే 5.35 కిలోల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ముగిసిన సుదర్శన నారసింహ హోమం



శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న హోమంలో పాల్గొన్న భక్తులు

హాలియా : పట్టణంలో సాయిప్రతాప్ నగర్ కాలనీ కొలువై ఉన్న స్వయంభూ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 27రోజులుగా నిర్వహిస్తున్న అష్టాక్షర సైదా సుదర్శన నారసింహ హోమం, మహా పూర్ణాహుతి తదితర పూజలు శనివారం నాటితో ముగిశాయి. ఈ సందర్భంగా స్థానాచార్యులు గోవర్ధనా రాఘవాచార్యులు మాట్లాడుతూ లోక కల్యాణార్థం కోసం నిత్య హోమం నిర్వహించినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ గౌడ్, వెంకటేశ్వరరాజు, పద్మజా దంపతులు గురువారెడ్డి, రవీందర్, సైదులు, అరుణ, మహాలక్ష్మి, స్వాతి, సరిత, జ్యోతి, శేషు కుమారి, శ్రీచరణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ టౌన్ : రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో జరిగిన మండల శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఆర్‌లు, నగదు రహిత వైద్యం, పీఆర్సీ అమలు, ఇతర సమస్యలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. అనంతరం 45మంది పెన్షనర్ల జన్మదినం సందర్భంగా వారితో కేక్‌కట్ చేయించి సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

నీటి విడుదలను కొనసాగించాలని వినతి

హాలియా : సాగర్ నియోజకవర్గంలో ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో నీటి విడుదల కొనసాగించాలని శనివారం సాగర్ డ్యాం ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. రాజవరం, పేరూర్, సూరేపల్లి మేజర్ల కింద ముమ్మరంగా వరి నాట్లు కొనసాగుతున్నాయని, నీటి విడుదలను కొనసాగించాలని హాలియా వ్యవసాయ మార్కెట్ చైర్మన్, తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం సాగర్‌కు వచ్చిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు స్థానిక ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారి సూచనల మేరకు సాగర్ డ్యాం ఎస్ఈకి విన్నవించారు. సాగర్ ఎడమ కాల్వకు షెడ్యూల్డ్ ప్రకారం ఈనెల 12 నుంచి 18 వరకు వారబంధిలో భాగంగా నీటి నిలుపుదల ఉందని ప్రస్తుతం రాజవరం, పేరూర్, సూరేపల్లి మేజర్ల పరిధిలో ముమ్మరంగా వరినాట్లు కొనసాగుతున్నాయని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తొలిసారి షెడ్యూల్ ప్రకారం వారబంధీ లేకుండా నీటి విడుదలను యథాతథంగా కొనసాగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో మార్కెట్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ యాదవ్, నాయకులు రాజారమేష్ యాదవ్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు

హుజూర్‌నగర్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హుజూర్‌నగర్‌లోని మాధవరాయిని గూడెంలో 12వ తేదీ నుంచి 14 వరకు తెలుగు రాష్ట్రాల గ్రామీణ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు మాధవరాయిని గూడెం యూత్ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.20 వేల నగదు, రెండవ రూ.18 వేలు, మూడవ రూ.16 వేలు, నాలుగవ రూ.14 వేలు, ఐదవ బహుమతి రూ.13 వేలు, ట్రోఫీలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 8099078951 నంబర్‌ను సంప్రదించాలన్నారు.